క్లుప్తంగా

సీసీ కెమెరాలతో నేరాల అదుపు

దాత విశ్రాంత ఉపాధ్యాయుడు పుర్ర అనంతయ్య



సీసీ కెమెరాల వద్ద దాత అనంతయ్యతో, కానిస్టేబుల్ కృష్ణ

దుద్యాల్: సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు అదుపుచేయొచ్చని దాత పుర్ర అనంతయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని పోలేపల్లి గ్రామంలో 3 కెమెరాలను ఆదివారం ఏర్పాటు చేయించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా దాత విశ్రాంత ఉపాధ్యాయుడు పుర్ర అనంతయ్య మాట్లాడారు. సీసీ కెమెరాలు గ్రామాల్లో ఉండడం వల్ల దోపిడీ, దాడులు జరిగినప్పుడు నేరస్తులను సులభంగా గుర్తించొచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, కానిస్టేబుల్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నూతన గ్రామ కమిటీ ఎన్నిక



అధ్యక్ష, ఉపాధ్యక్షులకు సన్మానం

బొంరాస్‌పేట: మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో బొంరాస్‌పేట బీఆర్ఎస్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ప్రకటించారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా రాముగౌడ్, ఉపాధ్యక్షుడిగా దప్పు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ముస్తాక్, సంయుక్త కార్యదర్శులుగా మాటూరి మల్లేశ్, తుల్జానాయక్, కార్యదర్శిగా పొట్ట వెంకటయ్య, కోశాధికారిగా నరేందర్, సోషల్ మీడియాకు మహేశ్ తదితరులను ఎన్నుకున్నారు.

ఆర్థిక సాయం అందజేత



సాయం చేస్తున్న స్నేహితులు

కుల్కచర్ల: ఆపదలో ఉన్న స్నేహితుడిని ఆదుకునేందుకు క్లాస్‌మేట్స్ అందరూ ముందుకొచ్చారు. తమకు తోచిన రీతిలో సాయం అందజేశారు. కుల్కచర్ల గ్రామానికి చెందిన బైరం ఊషయ్య అనారోగ్య సమస్యలతో ఇబ్బందులకు గురవుతున్నాడు. విషయం తెలుసుకున్న 1994–95 పదోతరగతి బ్యాచ్ తమ స్నేహితుడిని ఆదుకునేందుకు తక్షణ ఆర్థిక సహాయంగా రూ.20వేలు అందజేశారు. స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచేందుకు తాము ఎల్లప్పుడూ ముందుంటామని వారు భరోసా కల్పించారు.

అబ్బుకుంటకు జలకళ



జలకళ సంతరించుకున్న కుంట

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని నాగిరెడ్డిగూడ గ్రామ సమీపంలో గల అబ్బు కుంటకు జలకళ సంతరించుకుంది. కురుస్తున్న వర్షాలతో వరదనీరు కుంటలోకి భారీగా చేరింది. దీంతో చుట్టు పక్కన ఉన్న పంట పొలాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దేవాలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న నాయకులు

కేశంపేట: మండల పరిధిలోని కొండారెడ్డి, పోమాల్‌పల్లి గ్రామాల గుట్టపై గల శివాలయం పునర్నిర్మాణానికి నాయకులు ఆదివారం భూమిపూజ చేశారు. రూ.5 లక్షలతో దేవాలయాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో వేంకటేశ్వరస్వామి దేవాలయ చైర్మన్ కంచుకోట సత్యనారాయణ, నాయకులు, యాదగిరి, శ్రీనివాస్‌రెడ్డి, కుమారస్వామి, బాల్‌రాజ్, వేణు, రమేశ్, నర్సింహ, వెంకటేశ్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

అంతా కొత్తే..!

- పునర్విభజన అనంతరం చౌడాపూర్ మండల పరిషత్‌కు మొదటి ఎన్నికలు
- ఎవరు ఎన్నికైనా తొలి వ్యక్తులుగా గుర్తింపు
- ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలు ఎస్టీ రిజర్వుడ్
- ఆసక్తికరంగా సాగనున్న సమరం



చౌడాపూర్ మండల పరిషత్ కార్యాలయం

కుల్కచర్ల: మండల పరిధిలో స్థానిక ఎన్నికల కోలాహలం మొదలైంది. రేసులో ఉండబోయే ఆశావహులు ఎవరికి వారే టికెట్ కోసం ముమ్మర ప్రయత్నాలు మొదలు పెట్టారు. దీని కోసం జిల్లా నాయకులను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారు. మరోవైపు పోటీదారులు తక్కువగానే ఉండొచ్చనే సంకేతాలు ఉన్నాయి. చౌడాపూర్ నూతన మండలంలో ఏ పరిణామం చోటుచేసుకున్నా అది నూతన గుర్తింపుగానే నిలువనుంది. మండలాల పునర్విభజన అనంతరం కుల్కచర్ల మండలం నుంచి 12గ్రామ పంచాయతీలు మహబూబ్‌నగర్ నుంచి 12గ్రామ పంచాయతీలను కలిపి చౌడాపూర్ మండలాన్ని నూతనంగా ఏర్పాటు చేశారు. దీంతో నాటి నుంచి ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామాల్లో కార్యదర్శులు పాలన బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం రాష్ట్ర ఎన్నికల కమిషన్ స్థానిక సంస్థలకు నోటిఫికేషన్ విడుదల చేసింది.

ప్రత్యేకాధికారుల పాలనలో..

చౌడాపూర్ మండలం 2021, ఏప్రిల్ 21న 14రెవెన్యూ గ్రామాలతో నూతన మండలాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి పాలకులు, ప్రత్యేకాధికారుల పాలనలో కొనసాగింది. ప్రస్తుతం స్థానిక ఎన్నికల హెడ్యూల్ వెలువడడంతో చౌడాపూర్ మండలంలో ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానానికి ఎస్టీ మహిళకు రిజర్వుడు అయ్యింది. ఈ పోటీలో ఎవరు ఎన్నికైనా మండల పరిషత్ అధ్యక్షులుగా, జిల్లా పరిషత్ సభ్యులుగా వారి పేరు చిరకాలం నిలిచిపోనుంది.

మండలంలో 9ఎంపీటీసీలు స్థానాలు..

చౌడాపూర్ మండలంలో 24గ్రామ పంచాయతీలు ఉండగా ప్రస్తుతం 9ఎంపీటీసీ స్థానాలుగా ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. చౌడాపూర్‌లో 25,156 ఓటర్లు ఉండగా పురుషులు 12,742, మహిళలు 12,413, ఇతరులు 1గా ఉన్నారు. మండలానికి నూతన ఎంపీపీగా ఎన్నిక కావాలంటే 5ఎంపీటీసీ అభ్యర్థుల మద్దతు అవసరం ఉంటుంది.

ఆధిపత్యం చాటుకునేందుకు..

చౌడాపూర్ మండలంలో మండల పరిషత్ అధ్యక్ష స్థానానికి, జెడ్పీటీసీ సభ్యులుగా ఎస్టీ మహిళకే కేటాయించారు. అధికార కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్, బీజేపీ సైతం తమ ఆధిపత్యాన్ని చాటేందుకు సిద్ధమౌతున్నాయి. కాంగ్రెస్ నుంచి మాజీ ఎంపీటీసీ నరసింహ నాయక్, శివరం నాయక్, హుమ్లా నాయక్ కుటుంబాల నుంచి పోటీకి దిగనున్నారు. బీఆర్ఎస్ నుంచి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాందాస్ నాయక్, మండల యువజన విభాగం అధ్యక్షుడు మేగ్యానాయక్, మాజీ సర్పంచ్ మన్య నాయక్ కుటుంబాలు పోటీకి ఆసక్తి కనబరుస్తున్నాయి.

జెడ్పీటీసీ రేసులో ఆశావహులు

- కాంగ్రెస్ నుంచి ఎనిమిది మంది, బీజేపీ ఒకరు, బీఆర్ఎస్ నుంచి నలుగురు
- తాము సైతం బరిలో ఉంటామని తేల్చి చెప్పిన నేతలు
- ఎంపిక చేయడంలో తర్జనభర్జన పడుతున్న అధిష్టానాలు

దోమ: జెడ్పీటీసీ, ఎంపీటీసీ రిజర్వేషన్లు ఖరారు కావడంతో ఆశావహులు రోజు రోజుకు పెరిగిపోతున్నారు. దోమ మండలం నుంచి జెడ్పీటీసీ అభ్యర్థులుగా ఆయా పార్టీల నుంచి పోటీచేయనున్న అభ్యర్థులు తెరపైకి వస్తున్నారు. తాము తప్పనిసరిగా జెడ్పీటీసీ రేసులో ఉంటునట్లు అధిష్టానం దృష్టికి కూడా తీసుకెళ్తున్నారు. దీంతో అధిష్టానం సైతం ఎవరినీ ఎంపిక చేయాలో ఎవరిని తప్పించాలో తర్జనభర్జన పడుతున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ నుంచి బాసపల్లి గ్రామానికి చెందిన అనంతయ్య కూతురు నందిని, ఖమ్మంనాచారం నుంచి శాంతుకుమార్ భార్య విజయలక్ష్మి, దోమ వైస్ ఎంపీపీ బంగ్ల యాదయ్య భార్య అనితగౌడ్, ఈడిగి రమేశ్ భార్య అంజులగౌడ్, మోత్కూర్ గ్రామానికి చెందిన టీచర్ రామకృష్ణ కుటుంబం నుంచి ఒకరు, ఐనాపూర్ నుంచి ఈడిగి ఆశన్నగౌడ్ కోడలు రజిత, మల్లేపల్లి గ్రామానికి చెందిన మొగులయ్య గౌడ్ కూతురు, పాలేపల్లి గ్రామానికి దస్తయ్య భార్య బరిలో ఉంటున్నట్లు సమాచారం. ఇందులో ఈడిగి రజిత, ఖమ్మంనాచారం విజయలక్ష్మి, బాస్‌పల్లి నందిని పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా బీజేపీ నుంచి ఒకరు తెరపైకి వచ్చారు. ఐనాపూర్ గ్రామానికి చెందిన మేకల అనసుజా జెడ్పీటీసీ రేసులో ఉండేందుకు ముందుకు వచ్చారు. ఆమె భర్త మేకల యాదయ్య జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. అంతేకాకుండా బీజేపీలో క్రియాశీలకంగా ఉంటున్న ఆయనకు మండలంలో మంచి పేరు ప్రఖ్యాతలు కూడా ఉన్నాయి. ఇక బీఆర్ఎస్ నుంచి నలుగురు బరిలో ఉండేందుకు సుముకత వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. ఇటివలే మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డితో మంతనాలు చేసి తాము సైతం జెడ్పీటీసీ పోటీలో ఉంటామని చెప్పినట్లు సమాచారం. మాజీ వైస్ ఎంపీపీ మల్లేశం తల్లి మాజీ ఎంపీటీసీ చంద్రకళ. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మయ్య భార్య అరుణమ్మతో పాటు కిష్టాపూర్, దాదాపూర్ గ్రామం నుంచి మరో ఇద్దరు నేతలు బరిలో ఉంటున్నట్లు తెలిసింది.

అన్ని స్థానాలకు పోటీ చేస్తాం



మాట్లాడుతున్న రాజునాయక్

బీజేపీ మండల అధ్యక్షుడు రాజునాయక్

ధారూరు: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచుల స్థానాలన్నింటికీ అభ్యర్థులను నిలబెట్టి పోటీలో ఉంచనున్నట్లు ధారూరు మండల బీజేపీ అధ్యక్షుడు రాజునాయక్ పేర్కొన్నారు. ఎన్నికల కార్యాచరణ కోసం ధారూరులో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల జాబితాను తయారు చేస్తున్నామని ఆయన వివరించారు. బీజేపీ అభ్యర్థుల గెలుపునకు పార్టీ కృషి చేస్తుందన్నారు. ఈ సమావేశంలో రుద్రారం వెంకటయ్య, అంతారం నరేందర్‌రెడ్డి, రాజేందర్‌గౌడ్, బాబయ్య, శ్రీనివాస్‌నాయక్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజావీరుడు పండుగ సాయన్న



విగ్రహానికి నివాళులర్పిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

చేవెళ్ల: బహుజనుల హక్కులు, సామాజిక న్యాయం కోసం పండుగ సాయన్న చేసిన కృషి మరువలేనిదని మండల ముదిరాజ్ సంఘం నాయకులు అన్నారు. చేవెళ్లలో ఆదివారం ఆయన విగ్రహ ఆవిష్కరణ చేసి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. భూస్వాముల ఇళ్లను దోచి పేద ప్రజలకు పంచి పెట్టినట్లు గుర్తుచేశారు. పండుగ సాయన్న ప్రజావీరుడిగా తెలంగాణ రాబిన్‌హుడ్‌గా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. అలాంటి మహావ్యక్తుల పోరాటం, త్యాగం, చూపించిన మార్గాలు ఆదర్శంగా నిలుస్తాయని కొనియాడారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఊరడి నర్సింలు, యువజన అధ్యక్షుడు తెలుగు శ్రీనివాస్, నాయకులు శివరాజ్, రాంప్రసాద్, వెంకటేశ్, గోపాల్, గణేశ్, బాలయ్య, శ్రీనివాస్, భిక్షపతి, అంజయ్య, జనార్దన్, నర్సింలు ఉన్నారు.

ఆరోపణలు నిరూపిస్తే రాజీనామాకు సిద్ధం

మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గోవిందమ్మ

శంకర్‌పల్లి: మార్కెట్ కమిటీ కార్యవర్గంపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని, వాటిని నిరూపిస్తే రాజీనామాకైనా సిద్ధమని శంకర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గోవిందమ్మ స్పష్టం చేశారు. ఆదివారం వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో వైస్ చైర్మన్ కాశెట్టి చంద్రమోహన్, డైరెక్టర్లతో కలిసి ఆమె విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, మాట్లాడారు. ఇటీవల ఎంతో రాజకీయ అనుభవం ఉన్న పట్టణానికి చెందిన కొంతమంది వ్యక్తులు తాము స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్యకు చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్లు రూ.30 లక్షలు, డైరెక్టర్లు రూ.20 లక్షలు చెల్లించి పదవులు పొందామని ఆరోపించారన్నారు. ఇలాంటి నిరాధారమైన ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని, పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. వారి అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం మర్యాదగా వ్యవహరిస్తున్నామని, పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు. అదేవిధంగా గత 12ఏళ్ల కాలంలో ఎమ్మెల్యేగా యాదయ్య ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టి, నియోజకవర్గాన్ని రాష్ట్రంలో నంబర్ వన్‌గా ఉంచేందుకు నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. సమావేశంలో డైరెక్టర్లు ప్రశాంత్, సర్తాజ్, శ్రీహరి, సంతోష్, శేఖర్ పాల్గొన్నారు.

ముట్టి కేజీ తీయాలని తీర్మానిస్తాం

ఉల్లి, కూరగాయలపై ముట్టి 4 కేజీల నుంచి 5 కేజీలు తీస్తుండడంతో ఇప్పటికే పలుమార్లు రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే తాజాగా మార్కెట్ కమిటీ ఉల్లిపై క్వింటాల్‌కి ముట్టి కేవలం కిలో, కూరగాయలపై అరకిలో మాత్రమే తీసేలా నిర్ణయం తీసుకున్నారు.

బీజేపీ మండల ఇన్‌చార్జిగా విజయ్‌కుమార్



తాండూరు రూరల్: బీజేపీ తాండూరు మండల ఇన్‌చార్జిగా చెంగోల్ గ్రామానికి చెందిన వడ్ల విజయ్ కుమార్‌ను నియమించారు. జిల్లా ఎన్నికల కన్వీనర్ బాలేశ్వర్ గుప్తా, సీనియర్ నాయకులు మనోహర్ రావు, పటేల్ విజయ్‌కుమార్‌లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో పనిచేసిన మండల అధ్యక్షుడు అనారోగ్యంతో మృతి చెందడంతో నూతన ఇన్‌చార్జిని నియమించినట్లు వారు ప్రకటించారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డిలకు విజయ్‌కుమార్ ధన్యవాదాలు తెలిపారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన నాయకులు



మహేశ్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

మొయినాబాద్‌రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అందరూ కలిసి సమన్వయంగా పనిచేయాలని టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఆదివారం మొయినాబాద్ మండలానికి చెందిన నాయకులు, చేవెళ్ల నియోజకవర్గ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలందరూ సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేస్తూ అభ్యర్థులను గెలిపించుకోవాలని తెలిపారన్నారు. కార్యక్రమంలో బాకారం గ్రామ అధ్యక్షుడు కొమ్మిడి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ ఫిషర్‌మెన్ జిల్లా చైర్మన్ నారాయణపు మహేందర్‌ముదిరాజ్, కాశీంబౌలి మాజీ ఉపసర్పంచ్ నల్లా జయరాంరెడ్డి, బాకారం మాజీ వార్డు సభ్యుడు ఇమ్మిడి రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ, జెడ్పీటీసీ పోటీలో ఎవరు?

- బీసీ–మహిళకే టికెట్ కేటాయింపని ప్రచారం
- అధిష్టానం పరిశీలనలో మంగమ్మ, సృజన పేర్లు



దుద్యాల్ ఎంపీడీవో కార్యాలయం

దుద్యాల్: నూతనంగా ఏర్పడిన మండలానికి రెండు కొత్త పదవులు ఏర్పడ్డాయి. గతంలో ఉన్న వాటి కంటే ఒక ఎంపీపీ, జెడ్పీటీసీ సీటు పెంచారు. ఇక్కడ బీసీ–మహిళకు రెండు సీట్లు కేటాయించడంతో మేరుగు మంగమ్మకు ఎంపీపీ, ఆవుటి సృజనకు జెడ్పీటీసీ టికెట్ కేటాయించే అవకాశం ఉందని పార్టీ నాయకులు, మండల వాసులు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. మంగమ్మ భర్త మేరుగు వెంకటయ్య ప్రస్తుతం కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పార్టీకి సేవలందిస్తున్నాడు. గతంలో ఉమ్మడి బొంరాస్‌పేట్ మండల ఎంపీపీగా మేరుగు మంగమ్మ సేవలందించారు. అలాగే ఆవుటి సృజన భర్త ఆవుటి శేఖర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా పార్టీకి సేవలు చేస్తున్నారు. దానికి తోడు పార్టీ కష్టాల్లో ఉన్న సమయంలో కూడా అండగా ఉన్నారనే వాదన కూడా వినిపిస్తుంది. ఇందుకు గాను పార్టీ అధిష్టానం వీరిద్దరి పేర్లను పరిశీలిస్తున్నట్లు పార్టీ నాయకుల ద్వారా సమాచారం.

బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి



వెంకటస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఘనంగా వెంకటస్వామి జయంతి

కుల్కచర్ల: బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి వెంకటస్వామి అని పలువురు కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. కేంద్ర మాజీ మంత్రివర్యులు వెంకటస్వామి జయంతి వేడుకలను చౌడాపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం చౌడాపూర్ మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు మాట్లాడుతూ..బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి కేంద్ర మంత్రి చేసిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో కొత్త ఉమాపతి రెడ్డి, నరసింహ నాయక్, శివరాం, సలీం, బి.వెంకటేష్, శివకుమార్, రాము, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో వాటర్ ట్యాంక్

- ఆందోళనలో స్థానికులు
- కూల్చివేసి, నూతనంగా నిర్మించాలని వినతి



శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంకు

మొయినాబాద్: నలభై ఏళ్ల క్రితం నిర్మించిన వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలిపడుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పెద్దమంగళారంలో వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరింది. ట్యాంక్ పిల్లర్లు, బీమ్‌ల పెచ్చులూడి పోయి ఇనుప రాడ్లు తేలాయి. అయినా ఇప్పటికీ దానిలో నీటిని నింపుతుండడంతో ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ట్యాంకులో నుంచి నీళ్లు లీకవుతున్నాయి. ఇళ్ల సమీపంలో ప్రమాదకరంగా ఉన్న వాటర్‌ట్యాంకుకు మరమ్మతులు చేయించాలని.. లేదంటే పూర్తిగా తొలగించి కొత్తది నిర్మించాలని అనేక సార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించామని.. ఎవరూ పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న వాటర్ ట్యాంకును తొలగించాలని కోరుతున్నారు.

పట్టపగలు వెలుగులు

- నిరంతరం వెలుగుతున్న వీధి దీపాలు
- పట్టించుకోని విద్యుత్ సిబ్బంది

మొయినాబాద్‌రూరల్: విద్యుత్‌ను పొదుపుగా వాడాలని ఓ వైపు ప్రభుత్వం చెబుతున్నా అధికారుల నిర్లక్ష్యంతో వృథా అవుతూనే ఉంది. రాత్రి సమయాల్లో గ్రామాల్లో వెలుతురు కోసం ఏర్పాటు చేసిన వీధిదీపాలు పగలు సైతం వెలుగుతున్నాయి. వాటికి కొన్ని గ్రామాల్లో ఆన్, ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేయకపోవడంతో, మరికొన్ని ప్రాంతాల్లో స్విచ్‌లు ఉన్నా ఆఫ్ చేయకపోవడంతో కరెంట్ ఉన్నంతసేపు విద్యుత్ దీపాలు వెలుగుతూనే ఉన్నాయి. మండల పరిధిలోని బాకారం, శ్రీరాంనగర్, మేడిపల్లి, చందానగర్, టోల్‌కట్ట, చిన్నమంగళారం తదితర గ్రామాల్లో వీధి దీపాలు పగలు, రాత్రీ అనే తేడా లేకుండా ఎప్పుడు వెలుగుతున్నాయి. వీధి దీపాల నిర్వహణను విద్యుత్ సిబ్బంది పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి దీపాలకు ఆన్, ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



బాకారం గ్రామ పంచాయతీపై పట్టపగలు వెలుగుతున్న వీధిలైట్



బాకారం ఎస్సీ కాలనీలో వెలుగుతున్న వీధిలైట్లు

రోడ్డు తవ్వారు.. పనులు మరిచారు

- దారి లేక టేకులపల్లి వాసులకు తప్పని ఇబ్బందులు
- ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టని కాంట్రాక్టర్
- పట్టించుకోని అధికారులు



వంతెన నిర్మాణం కోసం తవ్విన టేకులపల్లి రోడ్డు

కొందుర్గు: ఉత్తరాసిపల్లి–టేకులపల్లి దారిలో నూతనంగా వంతెన నిర్మాణం చేపట్టేందుకు కాంట్రాక్టర్ ఉన్న రోడ్డు తవ్వారు. కానీ ప్రత్యామ్నాయంగా దారి ఏర్పాటు చేయలేదు. దీంతో టేకులపల్లి గ్రామస్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

ప్రత్యామ్నాయం లేక..

టేకులపల్లి గ్రామంలో దాదాపుగా 300 కుటుంబాలకు సంబంధించి 1000 మంది వరకు ప్రజలు జీవనం సాగిస్తారు. ప్రతిరోజు వివిధ పనులపై ఈ గ్రామం నుంచి 500ల మంది వరకు ఇతర గ్రామాలకు వెళ్లి వస్తుంటారు. అదేవిధంగా 50 మందికి పైనే విద్యార్థులు ఉన్నత చదువుల కోసం ముట్పూర్, షాద్‌నగర్ వెళ్తారు. అయితే టేకులపల్లి–ఉత్తరాసిపల్లి మధ్యన గల వాగుకు ఉన్న పాత వంతెనను నూతనంగా హైలెవల్ వంతెన నిర్మించేందుకు కాంట్రాక్టర్ పదిహేను రోజుల క్రితం రోడ్డు తవ్వేశారు. వంతెన పూర్తయ్యేవరకు సదరు కాంట్రాక్టర్ తాత్కాలికంగా దారి ఏర్పాటు చేయాలి. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలి. కానీ ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో తాము చాలా ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. ఏదైనా పనుల కోసం ఇతర గ్రామాలకు వెళ్లాలంటే దాదాపు 20 నుంచి 30 కిలోమీటర్లు అదరంగా తిరిగి షాబాద్ నుంచి వెళ్లాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పక్కనే రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉత్తరాసిపల్లి, ముట్పూర్ గ్రామాలకు వెళ్లాలన్నా 15 కిలోమీటర్లు అదనంగా తిరిగి రావాల్సి వస్తోందంటున్నారు. కనీసం పక్కనుంచి వెళ్లడానికి కాలిదారి సహితం సరిగా లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని, ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకొని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.